# మౌనంగా పలికిన హృదయ వీణ

-యం.ఆర్.వి.సత్యనారాయణమూర్తి

"అయితే మమ్మల్ని కూడా అస్సాం రమ్మంటారు!"

సుబ్రహ్మణ్యం అలా అడిగేసరికి ఒక్కసారిగా నిర్ఘాంతపోయాడు వెంకట రమణ. వెంటనే సర్దుకుని "మరి ఆ కార్యక్రమం కూడా మీ చేతుల మీదుగా కానిస్తే బావుంటుందని..." అన్నాడు.

"సరే... మీ పని పూర్తయిందని నిశ్చింతగా ఉండండి. ఈ మధ్య ఎక్కడికీ వెళ్లక చాలా బోర్‌గా వుంటోంది మాస్టారూ. మీతో ప్రయాణం చేస్తే నాలుగు మంచి మాటలు చెవినేసుకోవచ్చు. ఏమంటారు?"

"అలాగే.మరి నేవెళ్తాను. రైలు రిజర్వేషన్ చూసుకుంటాను" అని సుబ్రహ్మణ్యం దగ్గర సెలవు తీసుకుని ఇంటికి వచ్చాడు వెంకట రమణ. ఆతృతగా ఎదురువచ్చి అడిగింది వసుధ భర్తని 'ఏమయిందని?'

"ఆ... ఆ పని పూర్తయినట్టే. అయితే చిన్న లిటిగేషన్ పెట్టాడు సుబ్రహ్మణ్యం. తనూ అస్సాం వస్తాడుట''

"పోన్లెండి. అదీ మంచిదే. బాబుని మీరు జాయిన్ చేసి వచ్చేటప్పుడు రైల్లో రెండురోజులు ఒక్కరూ రావాలి. మీకు తోడుగా ఉంటాడు. రానివ్వండి.''

"తోడు సరే. మరో పన్నెండు వందలు టిక్కెట్లు, ఖర్చుల అన్నీ కలిపి రెండువేలు అవుతుందని నా భయం.''

"అన్నీ మన మంచికే అనుకోండి. పాలకొల్లు వెళ్లి రిజర్వేషన్ సంగతి చూడండి.''

వసుధ మాటలకు చిన్నగా నవ్వుకున్నాడు వెంకట రమణ.

ప్రతి చిన్న విషయాన్ని పాజిటివ్‌గా తీసుకుని ముందుకు సాగిపోతుంది. తనకేమో అన్నీ టెన్షన్స్... రేపు ఉదయాన్నే వెళ్లి గౌహతికి మూడు టిక్కెట్లు రిజర్వు చేయించాలని నిశ్చయించుకున్నాడు.

వెంకట రమణ ఎలిమెంటరీ స్కూలు ఉపాధ్యాయుడు. తండ్రి లక్ష్మి నారాయణ అడుగు జాడల్లో నడుస్తూ ఉత్తమ ఉపాధ్యాయుడిగా పేరు తెచ్చుకున్నాడు.

జగన్నాథపురం లక్ష్మీనారాయణ మాస్టారంటే జిల్లాలోని ఉపాధ్యాయులందరికీ ఎంతో గౌరవం.

ఖద్దరు పంచె, లాల్చీ, భుజంమీద కండువా, మొహాన గంధం బొట్టుతో ఉపాధ్యాయుడంటే ఇలా ఉండాలనిపించే విధంగా ఉంటారు. ముప్పై ఎనిమిది సంవత్సరాల ఉపాధ్యాయ వృత్తిలో ఎప్పుడూ బడికి ఆలస్యంగా రాలేదు, సెలవు పెట్టలేదు.

అమ్మాయి పెళ్లి కూడా వేసవి సెలవుల్లోనే చేసారు. బడి పిల్లల్ని స్వంత పిల్లల్లా భావించేవారు.

వెంకటరమణకు ఒక అమ్మాయి, అబ్బాయి. గత సంవత్సరమే అమ్మాయి పెళ్లి ఘనంగా చేసాడు. అల్లుడు బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్.

అబ్బాయి మనోహర్ హైదరాబాద్‌లో ఇంటర్ చదివి మంచి మార్కులతో పాసై ఐఐటికి సెలెక్ట్ అయ్యాడు. చెన్నైలో కౌన్సిలింగ్‌కు వెళ్లి వచ్చారు తండ్రీకొడుకులు.

గౌహతి ఐఐటిలో సివిల్ ఇంజనీరింగ్‌లో సీటు వచ్చింది మనోహర్‌కు. అప్పటి నుండి డబ్బు కోసం ప్రయత్నాలు ప్రారంభించాడు వెంకట రమణ.

కూతురి పెళ్లి కోసం చేసిన అప్పుకి వడ్డీ, కొత్తగా కట్టుకున్న ఇంటి కోసం తీసుకున్న బ్యాంకు లోను వాయిదాలతో ఉక్కిరిబిక్కిరవుతున్నాడు.

వసుధ ఇంటర్ మాత్రమే చదివింది. మార్టేరులో ఉన్న కాన్వెంట్‌లో పని చేస్తోంది. వాళ్లు నెలకు ఎనిమిది వందలు ఇస్తారు. అప్పులు వాయిదాలు పోగా అతని చేతికి వచ్చేది అయిదు వేలు మాత్రమే.

ఇదీ అతని ఆర్థిక పరిస్థితి. ఇటువంటి సమయంలో మనోహర్‌కి ఐఐటిలో సీటు వచ్చింది. డిగ్రీలో చేరుస్తానంటే కుర్రాడు కళ్లనీళ్లు పెట్టుకున్నాడు.

వసుధ కూడా ఏదో ఒక రకంగా వాడ్ని చదివిస్తే వాడి భవిష్యత్తు బావుంటుందని సలహా ఇచ్చింది. ఎటూ పాలుపోని పరిస్థితుల్లో బాల్య స్నేహితుడు సుబ్రహ్మణ్యం దగ్గరకు వచ్చాడు అప్పుకి.

సుబ్రహ్మణ్యం మంచి మాటకారి. చదువు పెద్దగా లేకపోయినా చిన్నా చితకా కాంట్రాక్టులు చేసి ఓ పాతిక లక్షలు వెనకేసాడు. హైదరాబాద్‌లో వున్న బావమరుదల సహాయ సహకారాలతో రియల్ ఎస్టేట్ వ్యాపారంలో ఓ కోటివరకు మూటగట్టుండాడు.

సుబ్రహ్మణ్యం తండ్రి ప్రసాదంగారు చాలా సౌమ్యులు, పరోపకారి.


జగన్నాధపురానికి సహకార సంఘాన్ని తీసుకువచ్చి రైతు జీవితాలలో వెలుగు పూలు పూయించిన మహాత్ముడు. సొసైటీనే విస్తృత పరచి బ్యాంకింగ్ సౌకర్యం కూడా ఏర్పాటు చేసారు.

గవర్నమెంటు బ్యాంకుల కంటే ప్రసాదంగారి సొసైటీలో డబ్బు దాచుకుంటే భద్రత ఎక్కువని ఆ ఊరి ప్రజల విశ్వాసం. జగన్నాధపురం ప్రగతికి బాటలు వేసిన ప్రసాదంగారు, లక్ష్మీనారాయణ మాస్టారు ఆ గ్రామానికి రెండు కళ్లని ప్రజల నమ్మకం. పెద్దవారిద్దరూ గతించినా వారి పిల్లలు స్నేహం మాత్రం నిరాఘాటంగా కొనసాగుతూనే ఉంది.

ప్రసాదంగారు వడ్డీ లేకుండా గ్రామస్థులకు ధన సహాయం చేస్తే సుబ్రహ్మణ్యం బ్యాంకు వడ్డీ రేటుకే అప్పు ఇస్తాడు అదీ తేడా. మనోహర్ ఫీజులకి, ఇతర అవసరాలకి 40 వేల రూపాయలు వెంకటరమణకి ఇవ్వడానికి సుబ్రహ్మణ్యం అంగీకరించాడు.

★★★

మర్నాడు వెంకట రమణ పాలకొల్లు వెళ్లి గౌహతికి మూడు టిక్కెట్లు రిజర్వు చేయించాడు. విశాఖపట్నం నుండి దొరికాయి టిక్కెట్లు. బెంగుళూరు-గౌహతి ఎక్స్‌ప్రెస్ రాత్రి ఏడుగంటలకు విశాఖపట్నం వస్తుంది.



అక్కడికి వెళ్లి ఎక్కాలి. వసుధ పిండి పులిహోర, చపాతీలు చేసి ఇచ్చింది దారిలో తినడానికని. నరసాపురం-విశాఖపట్నం బస్సు ఎక్కి సాయంత్రం ఐదుగంటలకు విశాఖ చేరుకున్నారు సుబ్రహ్మణ్యం, వెంకటరమణ, మనోహర్‌లు.

కరెక్టు టైమ్‌కి వచ్చింది గౌహతి ఎక్స్‌ప్రెస్. ముగ్గురూ బెర్తులు చెక్ చేసుకుని లగేజ్ జాగ్రత్తగా పెట్టుకుని ఆపై టిఫిన్లు చేసి పడుకున్నారు. విశాఖలోనే ఇద్దరు స్టూడెంట్లు పరిచయమయ్యారు మనోహర్‌కి. వాళ్లు గౌహతి ఐఐటికే. ఒకరిది విజయనగరం, ఇంకొకరిది శ్రీకాకుళం.

వెంకట రమణ మర్నాడు ఉదయం నిద్ర లేచేసరికి సుబ్రహ్మణ్యం స్నానం కూడా చేసేసి రెడీ అయిపోయాడు.

ట్రైన్ ఒరిస్సా రాష్ట్రంలో ప్రయాణిస్తోంది. బయట అన్నీ వరి పొలాలే కన్పించాయి.

"పంతులుగారూ! మన కోస్తా జిల్లాలో వెళుతున్నట్లుగానే ఉంది. పెద్ద తేడా ఏంలేదు భాషతప్ప."

సుబ్రహ్మణ్యం మాటలకి చిన్నగా నవ్వి ఊరుకున్నాడు వెంకట రమణ. బయట సన్నటి వానజల్లు పడుతోంది. ఆ జల్లులోనే వ్యవసాయ కూలీలు వరినాట్లు వేస్తున్నారు.

పక్కనున్న బెంగాలీ వ్యక్తితో వచ్చీరాని హిందీ మాట్లాడుతున్నాడు మనోహర్.

ఇంటర్మీడియట్ రెండు సంవత్సరాలు హైదరాబాద్‌లో ఉండడం, నాయనమ్మ దగ్గర హిందీ నేర్చుకుని హిందీ పరీక్షలు పాసవడం వలన మనోహర్‌కి హిందీ బాగానే వచ్చింది.

బెంగాలీ ఆయన అడిగాడు "ఎక్కడివరకు వెళుతున్నారు?"

ఐఐటిలో జాయిన్ అవడానికి వెళ్తున్నానని మనోహర్ చెప్పాడు.

ఆయన గౌహతి ఐఐటికి మంచి పేరు ఉందని, మీ ఆంధ్రావాళ్లు ఏటా ఎక్కువమంది జాయిన్ అవుతున్నారని చెప్పి స్నేహితులపట్ల జాగ్రత్తగా ఉండమని సలహా ఇచ్చారు.

"మీరేం చేస్తారని?" మనోహర్ అడిగితే పక్కనేవున్న ఆయన భార్య కల్పించుకుని 'బ్యాంక్‌లో పని చేస్తారని, మంచి కవి' అని చెప్పింది.

"మీ తెలుగు భాషలోని ఆధునిక కవుల గురించి తెలుసా?" అని బెంగాలీ ఆయన అడిగితే ఎన్నో వివరాలు చెప్పాడు మనోహర్.

"నువ్వు ఎంపిసి స్టూడెంట్‌వి కదా. లిటరేచర్ మీద ఇంత అవగాహన ఎలా వచ్చింది?" అడిగాడు బెంగాలీ ఆయన.

"మా అమ్మకు సాహిత్యం అంటే ఎంతో ఇష్టం. మా ఇంట్లో ఎన్నో పుస్తకాలు ఉన్నాయి. నేను సెలవుల్లోనే ఆ పుస్తకాలు చాలావరకు చదివాను" హిందీలో చెప్పాడు మనోహర్.

***

మర్నాడు ఉదయం ఆరుగంటలకు గౌహతి చేరారు. ఐఐటి వాళ్లు పంపిన లిస్టులో ఉన్న హోటళ్లల్లో తక్కువ రెంట్ ఉన్న సూరేదేవి హోటల్‌లో దిగారు ముగ్గురు.

స్నానాలు చేసి దగ్గరలోనే ఉన్న ఆనంద్ భండార్ రెస్టారెంట్‌కు వెళ్లారు. పూరీలు ఆర్డర్ ఇచ్చారు.

పెద్ద పెద్దవి నాలుగు పూరీలు పదిరూపాయలు అనేసరికి సుబ్రహ్మణ్యం మరీ ఆశ్చర్యపడ్డాడు.

"పంతులుగారూ! మన కుంటి సత్తిగాడి హోటల్లో రెండు పూరీలు ఎనిమిది రూపాయలు, పాలకొల్లులో పన్నెండు రూపాయలు. ఇక్కడేమిటండీ బాబూ పది రూపాయలకు నాలుగు పూరీలిస్తున్నాడు. వీరికి నష్టం రాదా?"

"అదేం ఉండదు. బహూశా వీరికి గోధుమపిండి తక్కువ ధరకు వస్తుందేమో. అందుకే ఇవ్వగలుగుతున్నారు. నష్టం పెట్టుకుని ఎవ్వరూ వ్యాపారం చేయరుకదా"


"అదీ నిజమేలేండి. మీరు ఇంకో ప్లేటు వేసుకోండి మాస్టారూ. బాగున్నాయి."

"వద్దు సుబ్రహ్మణ్యం. నీకు కావలిస్తే తీసుకో"

సుబ్రహ్మణ్యం రెండు ప్లేటు పూరీలు సుష్టుగా లాగించేసాడు. ఇద్దరూ టీ తాగారు. మనోహర్ పాలు తప్పితే ఏం తాగలేదు.


బయటకువచ్చి ఐఐటి ఆఫీసుకు ఫోనుచేస్తే కుర్రాడికి హాస్టల్ రూం ఎలాట్ చేస్తామని, మర్నాడు పేరెంట్స్ మీట్ ఉందని చెప్పారు.

హోటల్‌కి వచ్చి మనోహర్‌కి సంబంధించిన రెండు సూటుకేసులు,



## సరికొత్త సుస్మిత

మొన్నామధ్య జరిగిన ఫిలింఫేర్ అవార్డుల ఫంక్షన్‌లో సుస్మితాసేన్‌ని చూసినవాళ్లంతా ఆశ్చర్యపోయారు. కారణం కొంతకాలంగా పబ్లిక్ ఫంక్షన్లలో అంతగా కనపడని సుస్మితలో వచ్చిన మార్పు. బక్కపల్చగా తయారైన సరికొత్త సుస్మితని చూసినవాళ్లు ఇంత సన్నబడ్డారేంటి? అని అడిగితే- ముసిముసిగా నవ్వేసిందే తప్ప నోరుమెదపలేదు మరి. ప్రస్తుతం సుస్మితకి బాయ్‌ఫ్రెండ్స్ కూడా లేరట. కొత్త బాయ్‌ఫ్రెండ్ కోసమే సుస్మిత మారిన గెటప్ అని చెవులు కొరికేసుకుంటున్నారు బాలీవుడ్ జనాలు.



పుస్తకాలు, వసుధ ఇచ్చిన తినుబండారాలున్న రెండు డబ్బాలు తీసుకుని సెంటర్‌కు వచ్చారు.

ఐఐటికి వెళ్లే బస్‌లు, మళ్లీ ఐఐటి నుండి తిరిగి వచ్చేవి కూడా అక్కడే ఆగుతాయి. ఈ వివరాలన్నీ మనోహర్‌కి వాళ్లు పంపిన బుక్‌లెట్‌లో ఉన్నాయి.

గౌహతిలో దిగగానే సుబ్రహ్మణ్యం తన గెటప్ మార్చేసాడు. బాగా గంజి పెట్టి ఇస్త్రీ చేసిన ప్యాంటు, గోధుమరంగు పట్టు బుష్ షర్టు, జర్నీలో అందరి కళ్లు పడతాయని సూట్‌కేసులో దాచిన ఎనిమిది ఉంగరాలు తీసి రెండు చేతి వేళ్లకు అలంకరించాడు.

కుడి చేతికి మూడు తులాల బంగారు బ్రాస్‌లెట్, ఎడంచేతికి గోల్డు వాచీతో చామనచాయ రంగైనా పుష్టిగా ఉన్న సుబ్రహ్మణ్యం పర్సనాలిటీ, ఒత్తుగా మెలితిరిగిన మీసాలు చూస్తే రాయలసీమ రాజకీయ నాయకుడిలా కన్పిస్తాడు.

హోటల్ దగ్గర రెస్టారెంట్‌లోనూ అందరూ సుబ్రహ్మణ్యంకేసి ఆసక్తిగా చూడడం గమనించాడు వెంకట రమణ. ఇదీ ఒకందుకు మంచిదే అనుకున్నాడతను.

'ఆన్ ఐఐటి డ్యూటీ' అన్న స్టిక్కర్ తగిలించి ఉన్న బస్ దగ్గరకు వెళ్లారు ముగ్గురూ. ముందుగా సూట్‌కేసు, బిగ్‌షాపర్‌తో సుబ్రహ్మణ్యం బస్ ఎక్కగానే ఒకాయన పక్కకు జరిగి సీటిచ్చాడు. వెంకటరమణ, మనోహర్‌లు కూడా లగేజ్‌తో వచ్చి సర్దుకుని కూర్చున్నారు. స్టూడెంట్స్‌తో తల్లిదండ్రులతో సందడిగా, ఉల్లాసంగా ఉంది బస్.

బ్రహ్మపుత్ర నదికి ఉత్తరం ఒడ్డున ఉంది ఐఐటి. బస్సు రైల్ కం రోడ్ బ్రిడ్జి దాటి ఐఐటి కాంపస్‌లోకి వెళ్లింది.

ఏడువందల ఎకరాలకుపైగా ఉన్న విస్తీర్ణంలో ఏర్పాటుచేసిన ఆ బిల్డింగులు చూసి ఆశ్చర్యపోయాడు సుబ్రహ్మణ్యం. హాస్పిటల్, సూపర్‌బజార్, అన్ని క్రీడలకు సంబంధించిన ఆటస్థలాలు, స్విమ్మింగ్‌పూల్‌తోసహా అన్నీ ఉన్నాయి.

అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్ దగ్గర దిగి ఎంక్వయిరీ చేస్తే కామెంగ్ హాస్టల్‌లో రూమ్ ఎలాట్ చేసారని చెప్పారు.

బ్రహ్మపుత్రా నది ఉప నదులైన కపిల, మానస, కామెంగ్, డైహింగ్‌ల పేర్లను హాస్టల్‌కు పెట్టారని సీనియర్ విద్యార్థి ఆనంద్ చెప్పాడు. అర కిలోమీటరు నడిచి కామెంగ్ చేరుకున్నారు ముగ్గురూ. బి.బ్లాకులో 101 నెంబర్ రూం ఇచ్చారు మనోహర్‌కు.

"నీకు మంచి నెంబర్ వచ్చింది. బాగా చదువుకుని నెంబర్‌వన్‌గా ఉండాలి'' అని మనోహర్‌ని సుబ్రహ్మణ్యం అభినందించాడు. థాంక్స్ చెప్పాడు మనోహర్.

వెంకటరమణ, సుబ్రహ్మణ్యం, బిగ్‌షాపర్స్‌లోని డబ్బాలు, స్టీలుగ్లాసులు, స్పూన్‌లు వగైరాలన్నీ అల్మారాలో సర్దేశారు.

మనోహర్ టేబుల్ మీద సరస్వతీదేవి ఫోటో, పక్కనే రెండు వైట్ పేపర్ బుక్స్ పెట్టుకున్నాడు. హాస్టల్ పనివాడిని పిలిచి రూమ్ తుడిపించి, కడిగించి, మంచానికి దోమతెర కట్టేసరికి మధ్యాహ్నం పన్నెండుగంటలయింది.

భోజనానికి హాస్టల్ క్యాంటిన్‌కు వెళ్లారు ముగ్గురూ. మనోహర్ రూమ్ నెంబర్, తన రోల్ నెంబర్ చెప్పాడు. వెంకట రమణ, సుబ్రహ్మణ్యం మీల్స్ టోకెన్లు తీసుకున్నారు.


ఒక్కొక్కరికి 17 రూపాయలు. మళ్లీ రెండోసారి ఆశ్చర్యపోయాడు సుబ్రహ్మణ్యం. ఒక కూర, పప్పు, ఊరగాయ, సాంబారు, వేపుడు, అప్పడం, పెరుగుతోపాటు పుల్కాలు.

ఏది ఏమైనా అస్సాం వాళ్లు అమాయకులని, మన ప్రాంతంలో ప్లేటు మీల్సు 25 రూపాయలు, ఫుల్‌మీల్స్ 30 రూపాయలు ఉండగా ఇక్కడ ఫుల్‌మీల్స్ 17 రూపాయలకే ఇవ్వడం నిజంగా వెర్రితనమని వాదించాడు.

క్యాంటిన్‌లో పంజాబ్, యుపి, మహారాష్ట్ర ఇంచుమించు అన్ని రాష్ట్రాలకు చెందిన పిల్లలు, తల్లిదండ్రులు కన్పించారు. సుబ్రహ్మణ్యం భోజనం చేసే పద్ధతి, పెద్దగొంతుతో మాట్లాడడం, చేతులు కదిపేటప్పుడు అతని చేతికున్న ఉంగరాల ధనధగలు హాలులో ఉన్నవారికి వింతగా అన్పించాయి.

భోజనాలు అయ్యాక రూమ్‌కొచ్చి విశ్రాంతి తీసుకున్నారు. సాయంకాలం నాలుగుగంటలకు బయల్దేరి శక్తిపీఠాలలో ఒకటైన కామాఖ్య అమ్మవారి గుడికెళ్లారు ముగ్గురూ. ఒక పండిట్ ఎదురై ముగ్గురికీ దగ్గరుండి దర్శనం చేయించాడు.


★★★



## లక్షదీవులు

లక్ష ద్వీపాలనబడే ఈ దీవులు 16వ శతాబ్దంలో పోర్చుగీసువారి అధీనంలో ఉండేవి. ఆ తరువాత వాటిని సర్దార్ అలీరాజా పోర్చుగీసుల నుంచి వశపరచుకున్నాడు. 18వ శతాబ్దంలో అలీరాజా అనుయాయుల నుంచి ఈ దీవుల సముదాయాన్ని ఈస్టిండియా కంపెనీవారు స్వాధీనం చేసుకుని లక్షరూపాయలకి మళ్లీ వాళ్లకే అమ్మేసారు. అది మొదలు వీటికి లక్షదీవులనే పేరు వాడుకలోకి వచ్చింది.

-విమలారామం



మర్నాడు ఐఐటి ఆడిటోరియంలో జరిగిన 'ఫ్రెషర్స్ మీట్'లో సుబ్రహ్మణ్యం, వెంకట రమణ ఒక వరుసలో కూర్చున్నారు. అప్పటికే పరిచయమైన మిత్రులతో కలసి స్టేజికి దగ్గరగా ఉన్న వరుసలో కూర్చున్నాడు మనోహర్. అక్కడ కూడా ఆంధ్రా విద్యార్థులదే హవా. ఫైనలియర్ విద్యార్థి జితేంద్ర అందరికీ స్వాగతం పలికి ఎవరికి ఏ విధమైన సహాయం కావాలన్నా చేస్తానని, తన సెల్‌ఫోన్ నెంబరిచ్చాడు.

ఐఐటి డైరెక్టర్ సంస్థ ప్రగతి, ప్రతి కోర్సు యొక్క ప్రాధాన్యత, కోర్సు పూర్తయ్యాక మెరిట్‌ని బట్టి ఇచ్చే జీతాల వివరాలు తెలిపారు. 60 వేల నుండి రెండు లక్షల రూపాయలవరకు నెలకు ఇస్తారని వినగానే సుబ్రహ్మణ్యం వెంకట రమణని 'నిజనేనా?' అని అడిగాడు. మౌనంగా తలూపాడు వెంకటరమణ.

అమెరికా, ఆస్ట్రేలియా లండన్‌లలో పెద్ద పెద్ద జీతాలిస్తారని విన్నాడే గానీ మన దేశంలోనే ఐఐటి పాసైన వారికి ఇంత పెద్ద మొత్తంలో జీతం వస్తుందని తెలియగానే సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యాడు సుబ్రహ్మణ్యం.

"పంతులుగారూ! మీరు మంచి పని చేసారండీ బాబుని ఈ కోర్సులో చేర్పించి" అన్నాడు సుబ్రహ్మణ్యం పెద్దగొంతుతో.

డైరెక్టర్ స్పీచ్‌ని ఎంతో ఆసక్తిగ వింటున్నవారు ఒకసారి అసహనంగా వీరిద్దరికేసి చూసారు.

వెంకటరమణ చిరాగ్గా మొహం పెట్టి మాట్లాడవద్దని సైగ చేసాడు సుబ్రహ్మణ్యానికి.

డబ్బు సాయం చేసాడు, చిన్ననాటి మిత్రుడు కదాని తీసుకువస్తే అతని ప్రవర్తన చిరాగ్గా అనిపించసాగింది. పల్లెటూరి యాసతో, పెద్ద గొంతుతో మాట్లాడడం ఇక్కడికొచ్చాక భరించలేకపోతున్నాడు. ఇక్కడ చాలామంది ఆఫీషియల్సే.

సీట్లు వచ్చినవారిలో సగంమంది కోటీశ్వరుల పిల్లలే. తనలాంటి మధ్య తరగతి వారు చాలా తక్కువ.

ఎంతో డిగ్నిఫైడ్‌గా ఉండే వాతావరణంలోకి సుబ్రహ్మణ్యాన్ని తీసుకు వచ్చి తప్పు చేసాననిపించింది వెంకటరమణకు.

మూడవరోజు ఉదయం మనోహర్‌కి జాగ్రత్తలు చెప్పి రైలెక్కారు వెంకటరమణ, సుబ్రహ్మణ్యంలు. నాల్గవరోజు సాయంత్రం ఆరుగంటలకు విశాఖపట్నం చేరుకున్నారు. రైలు దిగి భోజనాలుచేసి బస్ కాంప్లెక్స్‌కు వచ్చి నరసాపురం బస్ ఎక్కి రాత్రి రెండుగంటలకు జగన్నాథపురం చేరుకున్నారు.

***

మర్నాడు ఉదయం వసుధకి విశేషాలన్నీ చెప్పి "అంతా సవ్యంగానే జరిగిందిగానీ ఈ ప్రయాణంలో ఒక పొరపాటు మాత్రం చేసాను" అన్నాడు వెంకటరమణ.

"ఏమిటి?" అంది వసుధ.

"సుబ్రహ్మణ్యాన్ని గౌహతి తీసుకెళ్లడం"

"అయ్యో... అదేమిటి...ఆయనేం చేసారు? ఎవరితోనైనా తగవు పెట్టుకున్నారా?"

"అదొక్కటే తక్కువ. మన ఊరిలో వినాయక స్వీటు బండి వాడి దగ్గర నిలబడి మాట్లాడతాడు చూడు అలా పెద్దగా గొంతెత్తి మాట్లాడేవాడు. ఎవరైనా ఇంగ్లీషులో మాట్లాడితే వచ్చీరానీ హిందీలో మాట్లాడి ఎదుటివార్ని కన్‌ఫ్యూజ్ చేసేవాడు. అస్తమానం వక్కపొడి నములుతూ శబ్దం చేస్తూ న్యూసెన్స్ క్రియేట్ చేసేవాడు. ముందు నేను నీకు చెబితే అర్థం చేసుకోలేదు. మీకు తోడుంటాడు, తీసుకెళ్లమని సతాయించావు. చూడు ఇప్పుడు రెండువేలయ్యాయి అతని ఖర్చులు. వచ్చే సెమిస్టర్‌కి మళ్లీ 20 వేలు కట్టాలి మనోహర్‌కి."

"బ్యాంక్ లోన్ పెడతానన్నారుగా. అది ట్రై చేయండి. లోన్ శాంక్షన్ కాగానే సెకండ్ సెమిస్టర్ ఫీజు కట్టేయవచ్చు. ప్రతిదానికీ టెన్షన్ పడకండి. నిదానం మీద అన్నీ అన్నీ సక్రమంగా జరుగుతాయి."

భార్య సమాధానంతో కొంత స్థిమితపడ్డాడు వెంకటరమణ. రోజు విడిచి రోజు మనోహర్ తల్లికి ఫోన్ చేసేవాడు.

తన క్లాస్‌లో ఆంధ్రా స్టూడెంట్స్ ఆరుగురు ఉన్నారనీ, వాతావరణానికి అలవాటు పడ్డానని చెప్పాడు.

గౌహతి నుండి వచ్చినప్పటినుంచీ వెంకటరమణ స్కూలు పనుల్లో బిజీగా ఉన్నాడు.

సుబ్రహ్మణ్యం ఒకసారి బజారులో కనిపించి 'అబ్బాయి ఫోన్ చేస్తు

## మిలియనీర్ కావాలంటే?

ఒక్కరోజులో మీరు మిలియనీర్ కావాలంటే జింబాబ్వేకి వెళ్లండి. కేవలం రు.3000 ఖర్చు చేస్తే మీకు మిలియన్ జింబాబ్వే డాలర్లు దొరుకుతాయి. అంటే అక్కడి కరెన్సీ అంత అధ్వాన్న స్థితిలో ఉందని అర్థం!

## రికార్డుకెక్కిన క్యారెక్టర్

204 సినిమాల్లో 72మంది నటులు ఆర్థర్‌కానన్ డయిల్ సృష్టించిన డిటెక్టివ్ షెర్లాక్ హోమ్స్ పాత్రను పోషించారు. ప్రపంచంలో అన్నిసార్లు తెరకెక్కిన పాత్ర మరొకటి లేదు.

## పాలసీసాలో కోడిగుడ్డు

బద్దలు కొట్టకుండా కోడిగుడ్డును పాలసీసాలోకి దూర్చవచ్చు. వెనిగర్‌లో పచ్చిగుడ్డును రెండురోజులు నానబెడితే దానిపై పెంకు మెత్తబడుతుంది. తరువాత సీసాని వేన్నీళ్లల్లో వెచ్చచేసి మెత్తబడిన గుడ్డును దానిపై పెడితే సీసాలోని గాలి క్రమంగా సంకోచించి ఆ గుడ్డును లోపలకు లాక్కుంటుంది.

-విమలారామం



న్నాడా?' అని అడిగితే రెండురోజులకు ఒకసారి ఫోన్ చేస్తున్నాడని చెప్పాడు.

★★★

జిల్లా ఉపాధ్యాయ శిక్షణా కేంద్రంలో ట్రైనింగ్‌కు వారంరోజులపాటు ఊరికి వెళ్లాడు వెంకటరమణ.

ఎనిమిదరోజున వచ్చాడు వెంకట రమణ. వసుధ ఒక కవరు అతని చేతి కిచ్చింది.

అన్యమనస్కంగా ఆ కవరు తెరిచిన వెంకటరమణ ఎంతో ఆశ్చర్యానికి లోనయ్యాడు. అందులో తాను సుబ్రహ్మణ్యానికి రాసి ఇచ్చిన 40 వేల రూపాయల ప్రామిసరీ నోటు, ఇరవై వెయ్యి రూపాయల నోట్లు ఉన్నాయి. ఏమీ అర్థంకాలేదు.

"ఏమిటిది?'' అడిగాడు భార్యని వెంకటరమణ అయోమయంగా చూస్తూ.

"నిన్న ప్రొద్దునే వచ్చి మీకోసం అడిగారు. ఊరికి వెళ్లి వారం దాటింది. ఈ రోజు వస్తారని చెప్పగానే వెళ్లిపోయారు. ఒక అరగంటపోయాక తిరిగి వచ్చి ఈ కవరు ఇచ్చి వెళ్లారు. అర్జంటుగా హైదరాబాద్ వెళ్తున్నానని, వచ్చాక కలుస్తానని చెప్పారు. ఉత్తరం కూడా ఉంది అందులో చూడండి'' అంది.

వెంకట రమణ కవరులోంచి ఉత్తరం తీసి చదవసాగాడు.

''**ప్రియమైన పంతులుగారికి,**

నమస్కారములు. మీతో గౌహతి రావడంవలన చదువుకున్న విలువ తెలుసుకున్నాను. మీ అబ్బాయిని మీరు ఎంత కష్టపడి చదివించారో నాకు తెలుసు. మన జిల్లాలో ఎవరికీ రాని సీటు మన మనోహర్‌కి వచ్చింది. అది మన గ్రామానికీ, జిల్లాకే గర్వకారణం.నేనూ నీతో పదవ తరగతివరకు చదువుకున్నానంటే కారణం మీ నాన్నగారే. లెక్కలు, సైన్స్ సబ్జెక్టులలో వెనుకబడిపోయిన నాపట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుని చదవించారు. ఆ పరిజ్ఞానంతోనే నేను వ్యాపారం చేసుకుని వృద్ధిలోకి వచ్చాను.

లక్ష్మీనారాయణ మాస్టారు పెట్టిన అక్షరభిక్షతో లక్షలు సంపాదించిన నేను మీరు డబ్బు సాయం కోసం వస్తే మీచేత పత్రం రాయించుకుని డబ్బు ఇచ్చాను. చాలా పెద్ద తప్పు చేసాను. నా పొరపాటుని సరిదిద్దుకునే ప్రయత్నమే మీ పత్రాన్ని మీకు తిరిగి అప్పగించడం. మనోహర్ రెండవ సెమిస్టర్‌కు కట్టవలసిన ఫీజు గురించి మీరు ఎంత టెన్షన్ పడుతున్నారో నేను గ్రహించాను. ఆ డబ్బు కూడా ఇస్తున్నాను. దయ వుంచి స్వీకరించండి. మీకు నేను ఈ డబ్బు ధర్మంగానో, అయాచితంగానో ఇస్తున్నానని భావించవద్దు. మా మాస్టారు ఋణం కొంతవరకైనా తీర్చుకునే అవకాశం నాకు కలిగించండి. మరో విషయం బాబు చదువుకి హైదరాబాద్‌లోని ఒక పెద్ద ఛారిటబుల్ ట్రస్టువారితో మాట్లాడాను. వారు కోర్సు పూర్తి అయ్యేవరకూ సహాయం చేస్తామన్నారు. మీరు బాబు గురించి ఏమాత్రం దిగులు పడవలసిన పనిలేదు. నేను ఊరి నుండి రాగానే అన్ని విషయాలు మాట్లాడుకుందాం. నన్ను స్వంత తమ్ముడిలా ఆదరించి మీతో గౌహతి తీసుకువెళ్లి కామాఖ్య అమ్మవారి దర్శనభాగ్యం కూడా కలిగించినందుకు కృతజ్ఞతలు.

**మీ మిత్రుడు**

**సుబ్రహ్మణ్యం''**

ఉత్తరం చదవడం ముగించిన వెంకటరమణ కళ్లల్లో నీళ్లు గిర్రున తిరిగాయి.

అది చూచిన వసుధ భర్త భుజంమీద చేయి వేసింది అనునయంగా.

"వసుధా! నేను సుబ్రహ్మణ్యాన్ని చాలా అపార్థం చేసుకున్నాను. ప్రతి మనిషికీ ఒక మనసుంటుందనీ, అది సరైన సమయంలోనే స్పందిస్తుందని ఆలస్యంగా గ్రహించాను. అంత పెద్ద సభలో ఆనందం పట్టలేక నేను అబ్బాయిని అక్కడ చేర్పించడం మంచి పని అని అభినందిస్తే లేనిపోని భేషజాలకు పోయి అతన్ని మాట్లాడవద్దని అన్నాను. సహృదయుడు కాబట్టి నన్ను ఏమీ అనలేదుసరికదా మన బాబు చదువు మనకి భారం కాకూడదని ఎంతో శ్రమ తీసుకుని ఇన్ని ఏర్పాట్లు చేసాడు. మనుష్యుల్లో మహాత్ములుంటారని నిరూపించాడు. మనకి కనిపించేదంతా నిజం కాదని, నాణేనికి రెండవవైపు కూడా పరికించాలని తెలుసుకున్నాను. సుబ్రహ్మణ్యం ఫోన్ నెంబర్ నా దగ్గరలేదు. ఇప్పుడే వాళ్లింటికి వెళ్లి అతని నెంబర్ తీసుకుని అతనితో మాట్లాడేవరకూ నాకు మనశ్శాంతిలేదు. పది నిముషాల్లో వస్తాను'' అని భార్యకు చెప్పి వడివడిగా సుబ్రహ్మణ్యం ఇంటివైపు నడవసాగాడు వెంకట రమణ పశ్చాత్తాత హృదయంతో.

★



# క్రేజీ ప్రియాంక!

బాలీవుడ్‌లో నంబర్ వన్ హీరోయిన్ అనిపించుకోకపోయినా యాడ్ వరల్డ్‌లో అత్యధిక ఆదరణ గల తారగా ఇప్పుడు తనదైన క్రేజ్‌ని సొంతం చేసుకుంది ప్రియాంకా చోప్రా. ఆమె నటించిన చిత్రాలు గత ఏడాది 8 విడుదలైతే వాటిలో రెండు (దోస్తానా, ఫ్యాషన్) సూపర్ హిట్టయ్యాయి. ఈ ఏడాది కూడా ఆమె తన చిత్రాలు కనీసం ఆరైనా విడుదలయ్యేలా ప్లాన్ చేసుకుంటోందిట. ఇటు సినిమాల్లో బిజీగా వుంటూనే బ్రాండ్ అంబాసిడర్ తనదైన పాపులారిటీని పెంచుకుంటోంది ప్రియాంకా చోప్రా.

